

సోమశిలలో 8.933 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 8.933 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.74,280
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.6,635
3 శాతం జీఎస్టీతో.. -	రూ.6,834
నవర (8 గ్రా) -	రూ.54,672



ప్రసన్నకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి తాము అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీలో చేరిన పలువురు తెలిపారు. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం	గురువారం
6:27	4:41

న్యూస్‌రీల్

చెంగాళమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు



స్వర్ణకిరీటం, చందనాలంకారంలో చెంగాళమ్మ అమ్మవారు

సూళ్లూరుపేట: కాళంగి నదీతీరాన సూళ్లూరుపేటలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అంబళ్లు పోసి ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన లక్ష కుంకుమార్చన పూజలోల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. చెంగాళమ్మ అమ్మవారి మూలవిరాట్ స్వర్ణ కిరీటం, చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులకు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వింజమూరు మండలం చాకలికొండలో టీడీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఏఆర్ కానిస్టేబుల్ రెడ్లదిన్ని బాలకృష్ణ పాల్గొని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఘటనపై కేసు నమోదైంది. ఏఆర్ కానిస్టేబుల్ కోడ్ ఉల్లంఘనపై మంగళవారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైన నేపథ్యంలో సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు ఏఆర్ కానిస్టేబుల్‌పై వింజమూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కోటిరెడ్డి కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని నిబంధన ఉన్నప్పటికీ కొంతమంది దానిని ఖాతరు చేయకపోవడంపై ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ కోడ్ ఉల్లంఘించిన ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు.

పెట్రోల్ తాగి బాలుడి మృతి



బాలుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): రెండేళ్ల బాలుడు పెట్రోల్ తాగి అస్వస్థతకు లోనయ్యాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఇరుగాళ్లమ్మ కట్టకు చెందిన షేక్ కరిముల్లా - అమ్ములు దంపతులు. వారికి కరిష్మా, కాలేషా(2)లు సంతానం. కరిముల్లా చికెన్ అంగడిలో, అమ్ములు చేపల దుకాణంలో పనిచేస్తూ పిల్లల్ని పోషించుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం అమ్ములు ఇరుకళల అమ్మవారి ఆలయం వద్ద పాత్రలు తోముతుండగా కాలేషా అక్కడే ఆడుకుంటున్నాడు. వాటర్ బాటిల్‌లో అడుగున ఉన్న పెట్రోల్‌ను తాగడంతో బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి స్థానికుల సాయంతో బాలుడిని చికిత్సనిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్సపొందుతూ ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి బాలుడు మృతిచెందాడు. ఈ మేరకు మంగళవారం బాధిత తల్లిదండ్రులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్సై సైదులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. కన్నబిడ్డ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నెల్లూరులో వైభవంగా జరుగుతున్న ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆత్మకూరులో నిర్వహించిన ఉగాది వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



వేడుకగా తెలుగు సంవత్సరాది

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మంగళవారం జిల్లా ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడిని నిర్వాహకులు భక్తులకు పంచిపెట్టారు. పంచాంగ శ్రవణంలో భాగంగా వేదపండితులు రాశి ఫలాలను వినిపించారు. ఈ సందర్భంగా పలుచోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– నెల్లూరు(బృందావనం)

ఉపాధి ఊతం

గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వ్యవసాయ పనులు లేని సమయంలో అధికశాతం మంది కూలీలు ఈ పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. వారికి దినసరి వేతనం అధికంగా అందేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. వేతనాలు నేరుగా కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1.19 కోట్ల ఉపాధి పనిదినాలు
- కూలీలకు రోజువారీ వేతనం రూ.259
- ఖర్చు చేసిన నగదు రూ.484 కోట్లు
- అందులో కూలీలకు అందజేసిన నగదు రూ.310 కోట్లు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పనిదినాలు లక్ష్యం



ఆత్మకూరు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



ఏఎస్‌పేట మండలంలో ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న అధికారులు (ఫైల్)

నెల్లూరు(పొగతోట): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తూ సకాలంలో వేతనాలు చెల్లిస్తోంది. జిల్లాలో రాపూరు, కలువాయి, సైదాపురం, ఉదయగిరి, మర్రిపాడు, వరికుంటపాడు, వింజమూరు, సీతారామపురం, జలదంకి, బోగోలు, గుడ్లూరు, ఉలవపాడు తదితర మండలాల్లో ఉపాధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ 60 వేల నుంచి 70 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. జిల్లాలో వ్యవసాయ పనులు అధికంగా జరిగే రోజుల్లో పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో ఉపాధి పనులకు కూలీలు అధికంగా హాజరవుతున్నారు.

కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

2023-24 ఆర్థిక సంవత్సరంలో 1.20 కోట్ల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. 2024 మార్చి 31వ తేదీ నాటికి 1.19 కోట్ల పనిదినాలు పూర్తి చేశారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో జిల్లాకు 90 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించగా ఆ లక్ష్యం పూర్తి కావడంతో అదనంగా 30 లక్షల పనిదినాలు పెంచారు. ఉపాధి పనుల కోసం రూ.484 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి పనులకు హాజరైన కూలీలకు వేతనాల ద్వారా సుమారు రూ.310 కోట్లు చెల్లించారు. ఈ పనులకు హాజరయ్యే కూలీల రోజు వేతనం రూ.259.38గా చెల్లించారు. గతంతో పోల్చుకుంటే రోజు వేతనం 2023-24 ఆర్థిక సంవత్సరంలో అధికంగా చెల్లించారు. ఉపాధి కూలీల వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతున్నాయి. ఈ పనుల పర్యవేక్షణకు క్లస్టర్ ఏపీడీలు, ప్రతి మండలంలో ఏపీఓ, ఈసీ, టీఏలు, బీఎఫ్‌టీలు, ఎఫ్ఏలు అందుబాటులో ఉన్నారు. కూలీలు చేసిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి ప్రతి మండలంలోనూ కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించగా.. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు రోజుకు రూ.269 దినసరి వేతనం వచ్చేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

కూలీలకు 100 రోజుల పనిదినాలు

జిల్లాలో జాబ్‌కార్డులు కలిగిన 4.10 లక్షల మంది కూలీలు నిత్యం ఉపాధి పనులకు హాజరవుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 28,894 మందికి 100 రోజుల పనిదినాలు కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 100 రోజుల పనిదినాలు కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించేలా డ్వామా అధికారులు చర్యలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జాబ్‌కార్డులు కలిగిన వ్యవసాయ కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో..

మండలాలు	జాబ్‌కార్డులు కలిగిన కూలీలు
37	4.10 లక్షల మంది

సంవత్సరం	కల్పించిన ఉపాధి పనిదినాలు
2019-20	79 లక్షలు
2020-21	1.10 కోట్లు
2021-22	1.29 కోట్లు
2022-23	1.06 కోట్లు
2023-24	1.19 కోట్లు



రోజు వారీ వేతనం పెంచేలా చర్యలు



జిల్లాలో ఉపాధి హామీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1.19 కోట్ల పనిదినాలు పూర్తి చేశాం. కూలీలకు వేతనాల ద్వారా రూ.310 కోట్లు చెల్లించాం. ఈ ఆర్థిక సంవత్సరంలో రోజు వారి వేతనం పెంచేలా చర్యలు చేపట్టాం. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేసి కూలీలకు వేతనం అధికంగా చెల్లించేలా చర్యలు చేపడతాం.

– వెంకట్రావ్, డ్వామా పీడీ

నగదు, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- రూ.2.70 లక్షల నగదు, 319 మద్యం బాటిళ్ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై పోలీసు యంత్రాగం ఉక్కుపాదం మోపుతోంది. ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. అనధికార మద్యం విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడుతోన్న వారిపై కేసులు నమోదు చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.2.70 లక్షల నగదును బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేదాయపాళెం, కొడవలూరు, కావలి ఒకటో పట్టణం, రూరల్, జలదంకి, చేజర్ల, మర్రిపాడు, కలువాయి, సైదాపురం, ఒలేటివారిపాళెం పరిధిలో 196 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారులు జిల్లావ్యాప్తంగా 123 బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రూ.50 వేలకు మించి నగదు, ఎక్కువగా నగలు తీసుకెళ్లరాదన్నారు. అవసరాల రీత్యా తీసుకెళ్లాల్సి వస్తే తగిన ఆధారాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అందరూ విధిగా పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై సీ విజిల్ యాప్, డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

చంద్రబాబును ప్రజలు విశ్వసించరు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కాకుటూరులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: అవకాశవాద రాజకీయాలకు పాల్పడే చంద్రబాబును ప్రజలు విశ్వసించే ప్రసక్తే లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలంలోని కాకుటూరు గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న మంత్రి కాకాణికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ జీవితమంతా మోసపూరితంగానే కొనసాగిందన్నారు. 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జతకట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకిచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. మహిళలకు, రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారో గుర్తుచేశారు. ఇంటికో ఉద్యోగం అని చెప్పిన చంద్రబాబు తన కొడుకు లోకేశ్‌కు మంత్రి పదవి ఇవ్వడం తప్ప నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేదని తెలిపారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలను అన్నివిధాలా మోసం చేయడంతో 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారని తెలిపారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక ఎన్నికల వాగ్దానాలను నూటికి నూరు శాతం అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు అన్నివిధాలా అండగా నిలిచారని తెలియజేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. చంద్రబాబు పాలనలో పింఛన్ల కోసం లబ్ధిదారులు అష్టకష్టాలు పడేవారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేశారని తెలిపారు. వలంటీర్లు అవ్వాతాతలు, దివ్యాంగుల ఇంటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి పింఛన్ల పంపిణీని అడ్డుకునేందుకు అనేక కుట్రలు చేశారని మండిపడ్డారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి తీసుకువస్తారని, తద్వారా సంక్షేమ పాలన మళ్లీ వస్తుందని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తే చర్యలు

- ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



ఆత్మకూరులో సీఐ, ఎస్సైలకు సూచనలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

ఆత్మకూరు: ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకం కలిగించినా, ఓటర్లను ప్రలోభపెట్టినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ హెచ్చరించారు. ఆత్మకూరులోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల భౌగోళిక స్థితిగతులు, పోలింగ్ కేంద్రాల తాజా పరిస్థితులు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు తదితర అంశాలపై సీఐ జి.వేణు, ఎస్సై కె.ముత్యాలరావులను అడిగి తెలుసుకున్నారు. పలు స్టేషన్ల పరిధిలో బైండోవర్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను పోలీసు అధికారులు తరచూ సందర్శించాలని, అక్కడి పరిస్థితులను సమీక్షించి జిల్లా అధికారులకు తెలియజేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ప్రత్యేక చెక్ పోస్టుల వద్ద, జాతీయ రహదారులపై 24 గంటలు వాహనాలను తనిఖీ చేయాలని తెలిపారు. రూ.50 వేలకు మించి నగదు, విలువైన నగలు తీసుకెళ్లరాదని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అత్యవసరమైతే సంబంధిత ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని వారికి సూచించాలని తెలిపారు. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారాన్ని సీ విజిల్ యాప్ ద్వారా లేదా టోల్ ఫ్రీ నంబరు 112కు కాల్ చేసి తెలిపేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన ఏఎస్‌పేట, సంగం పోలీస్‌స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

- 'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచి ఇంగ్లిషు మీడియాన్ని అందుబాటులోకి తేవడం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.. ఆసక్తి ఉన్న వారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని నిర్వహించాం. ఆన్‌లైన్‌లో ఉచితంగా అందజేస్తాం' అని తెలిపారు. ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింక్ వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్‌నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని తెలిపారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు.

మే 18 నుంచి ఎన్‌పీఎల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఐపీఎల్ తరహాలో మొట్టమొదటిసారి నెల్లూరు ప్రీమియం లీగ్ (ఎన్‌పీఎల్) నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కేర్ టేకర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న క్రికెట్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా క్రికెట్ క్రీడాకారులకు అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ టోర్నీని భారీస్థాయిలో మోపూరు సుందరరామయ్య(ఎంఎస్ఆర్) నెల్లూరు ప్రీమియం లీగ్ పేరుతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నీలో భాగంగా 8 ఫ్రాంచైజీలు ఒక ఫ్రాంచైజ్‌లో 20 మంది క్రీడాకారులను కొనుగోలు చేస్తారన్నారు. అయితే ఒక్కొక్క ఫ్రాంచైజ్ రూ.50 వేల లోపు క్రీడాకారులందరినీ కొనుగోలు చేయాలని నిబంధన విధించామన్నారు. క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని నెల్లూరు, గూడూరు, కావలి, ఆత్మకూరు, సూళ్లూరుపేట, నెల్లూరురూరల్, బుచ్చిరెడ్డిపాళెంలకు చెందిన ఫ్రాంచైజీలు వేలంలో పోటీ పడతాయని తెలిపారు. ఆసక్తి, ప్రతిభ కలిగిన క్రీడాకారులు తమపేర్లను ఈ నెల 30వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ వివరాలను పరిశీలించి ఆక్షన్‌కు అనుమతి ఇస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేశామని, ప్రతి క్రీడాకారుడు క్యూఆర్ కోడ్ ద్వారా ఈ యాప్‌లో నమోదు కావాలని సూచించారు. ఈ పోటీలను యూట్యూబ్‌లో లైవ్‌లో ప్రసారం చేస్తామని తెలిపారు. వివరాలకు 80506 23562, 99089 92749 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం ఎన్‌పీఎల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో గూడూరు రూరల్ క్రికెట్ క్లబ్ ప్రతినిధి శశాంక్ జక్కంరెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బంగారు గరుడ వాహనంపై లక్ష్మీనృసింహుడు



పెంచలకోనలో బంగారు గరుడ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం ఉగాది వేడుకలు జరిగాయి. ఉదయం శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. 9 గంటలకు అలంకార మండపంలో పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవ విగ్రహాన్ని బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పూలు, ఆభరణాలతో అలంకరించారు. కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు కోనకు చేరుకుని శ్రీవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే రాపూరులోని రాపూరమ్మ, షిర్డీ సాయిబాబా మందిరం, మద్దెలమడుగులోని కృష్ణ మందిరంలో వేడుకలను నిర్వహించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 61,920 మంది స్వామివారిని దర్శించుకోగా 17,638 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కారు బోల్తా

- నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో కారు

గుడ్లూరు: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడడంతో అందులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని జాతీయ రహదారిపై మోచర్ల వద్ద మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న కారు మోచర్ల వద్దకు వచ్చే సరికి టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రహదారిపైనే బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న డ్రైవర్ గోపి, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రులను తమ వాహనంలో కావలికి తరలించారు.

సైనికుల్లా పనిచేయాలి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించేలా ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకులు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఎన్‌జేఆర్ భవనంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో మళ్లీ సువర్ణ పరిపాలన జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. బీసీ నేత బొలిగర్ల మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ బాగుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు దొంతు శారద, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ పాల్గొన్నారు.

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని నమ్మొద్దు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

ముత్తుకూరు: 'సర్వేపల్లి తెలుగుదేశం అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని నమ్మొద్దు. ప్రజలను మోసం చేయడమే ఆయనకు తెలుసు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో టీడీపీ నుంచి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. మండలంలోని ముత్తుకూరు పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన 15 టీడీపీ కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరులోని మంత్రి కాకాణి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన సోమిరెడ్డి పోర్టు యాజమాన్యం, కంపెనీలను బెదిరించి డబ్బు వసూలు చేసుకోవడం తప్ప నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించలేదన్నారు. పోర్టు యాజమాన్యం దగ్గర రూ.5 కోట్లు డిమాండ్ చేశాడని, ఆ నగదు ఇవ్వడానికి నిరాకరించడంతో వారిపై తీవ్ర విమర్శలకు దిగాడన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటర్లు సోమిరెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ప్రసన్నకుమార్‌రెడ్డికి అండగా ఉంటాం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: వచ్చే ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి అండగా ఉంటామని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల వారు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మంగళవారం నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో అనేక మంది పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కోవూరు మండలంలోని పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబపురానికి చెందిన వలంటీర్లు రాజీనామా చేసి పార్టీలో చేరారు. ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ప్రసన్న విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు చెప్పారు.

అలాగే ఇందుకూరుపేట మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ మూలకట్ట సంఘానికి చెందిన ఏకొల్లు చిన్నయ్య, మాజీ సర్పంచ్ ఏకొల్లు నిర్మల ఆధ్వర్యంలో సుమారు 100 మంది టీడీపీని వీడారు. విడవలూరు మండలం రామతీర్థం, పాతూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తంబి రామలింగయ్య, చినిగి బాబు, నాటూరి గిరి బాబు, నెల్లూరు చెంచురత్నం తదితరులు బుచ్చింగారి తిరుపతయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. బుచ్చిరెడ్డిపాళెం రేబాల పంచాయతీకి చెందిన గూడి అశోక్, సుధాకర్, సునీల్, సందీప్ వారి అనుచరులు వందమంది తెలుగుదేశాన్ని వీడారు. కొడవలూరు మండలం, పద్మనాభసత్రానికి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ కదులు కృష్ణ, నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, జొన్న శివకుమార్ తదితరులు కొట్టే మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ప్రసన్నకుమార్‌రెడ్డి, వీరి చలపతిరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌రెడ్డి, కోవూరు ఏఎంసీ డైరెక్టర్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, బుచ్చి, కోవూరు మండలాల కన్వీనర్లు చొర్లో సతీష్‌రెడ్డి, నలబోలు సుబ్బారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగా పోటీ చేసే ధైర్యం బాబుకు లేదు



ప్రచారం చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): 'ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం చంద్రబాబు నాయుడికి లేదు. ఆయన ఏనాడూ ప్రజలకు మంచి చేయలేదు. ఈసారి బీజేపీ, జనసేనతో కూటమి కట్టి వస్తున్న టీడీపీకి ఓటర్లు గుణపాఠం చెప్పాలి' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కిస్తీపురం, ఆరవీటిపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రతి కుటుంబానికి పక్కాగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. చంద్రబాబు పాలనలో కరువుతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాయన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా పేరు గడించారన్నారు. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకొనే చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తుకురాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఆయా గ్రామాల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని మేకపాటి పరామర్శించారు. ఉగాది పర్వదినం సందర్భంగా వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, నేతలు పల్లాల కొండారెడ్డి, కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, పల్లాల ప్రసాద్, బయ్యపరెడ్డి విజయరెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి, అంకినపల్లి నారసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుడి చేరిక



శ్రీనివాసులుకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుతున్న రామిరెడ్డి

కావలి: అల్లూరులోని అల్లూరుపేట సత్రానికి చెందిన తెలుగుదేశం నాయకుడు పచ్చబొట్ల శ్రీనివాసులు యాదవ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆయన మంగళవారం కావలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరేందుకు శ్రీనివాసులు యాదవ్ సుముఖత వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే అతడికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు యాదవ్ మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి టీడీపీలో ఉన్నానని, ఎంతో మంది నాయకులను చూశానన్నారు. నేటి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి వ్యవహారశైలి, భాషను వింటే పార్టీలో నాయకుమా?, బానిసలమా? అనే అనుమానం కలిగిందన్నారు. కృష్ణారెడ్డి తమను కూలీలుగా చూస్తున్నాడన్నారు. ఆత్మాభిమానం ఉన్న ఏ ఒక్కరూ కూడా అతని వద్ద పని చేయరన్నారు. కావలిలో టీడీపీకి ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరుకు చెందిన బీద మస్తాన్‌రావు, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి నాయకత్వంలో కష్టపడి పనిచేసి రామిరెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు సామంతుల సురేష్‌కుమార్‌రెడ్డి, గోర్ల రాజేష్ యాదవ్, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తుళ్లూరు శ్రీనివాసులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 7.879 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 7.879 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.


మద్యం బాటిళ్ల స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్సై

సైదాపురం: మండలంలోని పాలూరు గ్రామానికి చెందిన సుదలగుంట సుందరయ్య అనే వ్యక్తి వద్ద పది మద్యం బాటిళ్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. నిబంధనలకు మించి మద్యం బాటిళ్లు కలిగి ఉండడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

టీటీడీ జేఈఓ బాధ్యతల స్వీకరణ



గౌతమి

తిరుపతి(అలిపిరి): టీటీడీ జేఈఓ (ఆరోగ్యం–విద్య)గా ఎం.గౌతమి మంగళవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీలోని పలువురు అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.55
పండ్లు	: రూ.24

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 163
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 284
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 314
లేయర్ చికెన్	: 162

సముచిత స్థానం కల్పిస్తాం : విక్రమ్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చౌటభీమవరం వైఎస్సార్‌సీపీ నాయకులు మాలేపాటి తిరుమలనాయుడు, కృష్ణయ్య నాయుడు, కృష్ణయ్య, మధుల ఆధ్వర్యంలో ఆ ఊరి మాజీ సర్పంచ్ మాజీ సర్పంచ్ దుర్గంపాటి రమణయ్య, 20 కుటుంబాల వారు పార్టీలో చేరారు. మంగళవారం నెల్లూరులోని తన నివాసంలో ఎమ్మెల్యే మేకపాటి వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలన నచ్చి ప్రతిపక్షాలకు చెందిన వారు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనను చూసి అనేకమంది జగనన్నకు అభిమానులుగా మారుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు అందరం కష్టపడి పనిచేయాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత సంక్షేమం అందజేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆదరించండి



కరపత్రం అందజేస్తున్న ఎండీ ఖలీల్ అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని, వచ్చే ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ కోరారు. నగరంలోని 51వ డివిజన్ కపాడిపాళెంలోని రాచమానువీధి, దండువారివీధి, చెన్నకేశవ దేవాలయం వీధి తదితర ప్రాంతాల్లో మంగళవారం ఖలీల్ అహ్మద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయన్నారు. అందువల్లే ఆయన మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని కోరారన్నారు. టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ నాలుగున్నర సంవత్సరాలు కనిపించలేదన్నారు. ఎన్నికలు వచ్చేసరికి మళ్లీ వార్డుల్లో తిరుగుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఆయన ప్రజలకు కనిపించరని తెలిపారు. తాను నిత్యం నగర ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాహిత్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.